## కుప్పం నూతన మున్సిపల్ కమిషనర్ గా శ్రీనివాసరావు నియామకం

కుప్పం జూలై 17 సూర్య వాస్తవం

కుప్ప మున్సిపాలిటీ నూతన కమిషనర్ గా ప్రకాశం జిల్లా గిద్దలూరు మున్సిపాలిటీ కమిషనర్ గా పనిచేస్తున్న శ్రీనివాసరావును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ ఉత్తర్వులను జారీ చేసింది.



ప్రస్తుతం కుప్పం మున్సిపల్ కమిషనర్ గా పనిచేస్తున్న నాగేశ్వరావు నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ గా ప్రభుత్వం నియమించింది. కుప్పం అభివృద్ధిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో ఇప్పటికే కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (కడ) కోసం ప్రాజెక్టు డైరెక్టర్ గా వికాస్ మర్మట్ ను ప్రభుత్వం నియమించింది. ఆయన గత వారం కడ పిడీ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో కుప్పంను ప్రగతి పథం వైపు పరుగులు పెట్టించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలలో భాగంగా మున్సిపల్ శాఖ కమిషనర్ గా శ్రీనివాసరావును ప్రభుత్వం నియమించింది. నేడు చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆధ్వర్యంలో కుప్పంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్న నేపథ్యంలో ఆయన కమిషనర్ గా బాధ్యతలు స్వీకరిస్తారా లేదా రెండు రోజుల తర్వాత స్వీకరిస్తారా అన్నది ఇంకా తెలియ రాలేదు. మున్సిపల్ అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగేందుకు, పాలనా వ్యవహారాలు చక్కదిద్దేందుకు ఆయన కృషి చేయాల్సి ఉంది.

## తలుపుల గంగాధర్ నీ వెంటనే అరెస్టు చెయ్యాలి: కదిరి కాంగ్రెస్ పార్టీ

అమరావతి ప్రత్యేక ప్రతినిధి (సూర్య వాస్తవం ):

కదిరి పట్టణానికి చెందిన న్యాయవాది రామస్వామి నాయుడుపై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖుదాబక్ష్, మాయన బాబా, షౌకత్ అలీ , ఇర్ఫాన్ డిమాండ్ చేశారు. పట్టణంలోని కోర్టు సమీపంలో బాధితుడు రామస్వామి నాయుడుతో పాటు పలువురు న్యాయ వాదులు రిలే నిరాహార దీక్షకు మద్దతు




ప్రకటించారు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రామస్వామి నాయుడి ఆఫీసులోకి వెళ్లి తలుపుల గంగాధర్, తదితరులు దాడి చేశారన్నారు. అదే రోజున పోలీసులు కేసును నమోదు చేశారని అయితే ఇంత వరకు నిందితులను అరెస్ట్ చేయలేదని విమర్శించారు. న్యాయవాదిపై దాడి జరిగితే ఇంత వరకు నిందితులను కోర్టు పంపకపోతే ఇక సామాన్యుడి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని వ్యాఖ్యానించారు. నిందితుడు పట్టణంతోపాటు పోలీస్ స్టేషన్ దగ్గర యథేచ్ఛగా తిరుగుతున్నా పట్టించుకోలేదని ఆరోపించారు. దౌర్జన్యాలు చేసినటువంటి దళిత ముసుగులో ఉన్నటువంటి ఇటువంటి వాళ్లపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం జరిగింది. వెంటనే బాధితులకి న్యాయం చేసి తప్పు చేసిన వ్యక్తి అరెస్టు చేసి పోలీసులు తమ పాత్రను పూర్తిస్థాయిలో నిర్వర్తించాలని వారు కోరారు

## నేడు కుప్పం లో కలెక్టర్ చే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కుప్పం, జూలై 17(సూర్యవాస్తవం):

కుప్పం నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ నేడు కుప్పంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొననున్నారు. ముఖ్యమంత్రి నారా



చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ అధ్యక్షులు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తో కలిసి కలెక్టర్ ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈనెల 5 న మొదటి సారి కుప్పం లో కలెక్టర్, ఎమ్మెల్సీ లో ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు ఊహించని రీతిలో స్పందన వచ్చింది. దీంతో మరోసారి ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. నేటి ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లను కుప్పం ఎంపీడీవో ఖాదర్ భాషా, అర్బన్ సిఐ జిటి నాయుడు బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్, పోలీసు సిబ్బంది, పాల్గొన్నారు

## అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు..

### ప్రయాణికులకు తప్పిన ప్రాణాపాయం

శాంతిపురం, జూలై 17(సూర్యవాస్తవం):

శాంతిపురం మండల పరిధిలోని కుప్పం కేజీఎఫ్ రహదారిపై స్థానిక రాళ్ళబూదుగూరు పెట్రోల్ బంక్ వద్ద బుధవారం ఉదయం కుప్పం డిపో కు చెందిన ఆర్టీసీ బస్సు అదుపు తప్పింది.ఓ ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ముళ్ళపొదల్లోకి దూసుకెళ్లింది. స్థానికుల కథనం మేరకు రాళ్ళబూదుగూరు పెట్రోల్ బంక్ సమీపంలోని మలుపు వద్ద ఒక ద్విచక్ర వాహనం అతివేగంగా



రావడంతో ఆ వాహనాన్ని తప్పించిపోయి ఆర్టీసీ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించారు. దీంతో ప్రయాణికులు ఎలాంటి ప్రాణాపాయం లేకుండా బయటపడి ఊపిరి పీల్చుకున్నారు.

# మీడియా ప్రతినిధుల పట్ల దురుసుగా ప్రవర్తించిన విజయ్ సాయి రెడ్డి

## తక్షణమే అతని బెయిల్ రద్దు చేసి అరెస్టు చేయాలి.. కుప్పం ప్రెస్ క్లబ్ జర్నలిస్టుల డిమాండ్

కుప్పం జూలై 17 సూర్య వాస్తవం

రాజ్యసభ సభ్యుడు విజయ్ సాయి రెడ్డి బెయిల్ రద్దుచేసి వెంటనే అరెస్టు చేయాలని కుప్పం ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు డిమాండ్ చేశారు. మీడియా ప్రతినిధుల పట్ల అతను దురుసుగా ప్రవర్తించిన తీరుపై కుప్పం ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు బుధవారం తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు కుప్పం పట్టణంలో ర్యాలీ నిర్వహించి "విజయ సాయి రెడ్డి ని వెంటనే అరెస్టు



చేయాలి"జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. అంతకుమునుపు వారు కుప్పం పోలీసులకు విజయ సాయి రెడ్డి పై ఫిర్యాదు చేశారు. కుప్పం ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు స్థానిక బస్టాండ్ సర్కిల్ లో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు ఘటించారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు విజయ్ సాయి రెడ్డి మీడియాపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రెస్





క్లబ్ అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ... బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధిగా ఉండి మీడియా పట్ల విజయసాయిరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం అత్యంత దురదృష్టకరమని అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పక్కనపెట్టి కొంతమంది తామే రాజ్యాంగాన్ని రచించుకుని ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. మీడియా ప్రతినిధుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంపీ విజయసాయిరెడ్డి పై కేసు నమోదు చేసి ఆయనను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సి.బి.ఐ విజయసాయిరెడ్డి బెయిల్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కుప్పం ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి అస్గర్ మాట్లాడుతూ... ఐదేళ్ల వైసిపి పాలనలో జర్నలిస్టుల సంక్షేమాన్ని పట్టించుకోకపోగా అధికారం కోల్పోయిన ఫ్రస్టేషన్లో కూడా జర్నలిస్టులను రారా, పోరా అంటూ ఏక వచనంతో సంబోధిస్తూ జర్నలిస్టులను కించపరచడం విజయ్ సాయి రెడ్డికి తగదని మండిపడ్డారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ఏ.పీ.జే.ఎఫ్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీపతి మాట్లాడుతూ... మీడియాపై రాజ్యసభ సభ్యుడు విజయ్ సాయి రెడ్డి మీడియా ప్రతినిధులను చులకనగా మాట్లాడటం ఆయన సభ్యతకే వదిలేస్తున్నామని అన్నారు. ఇలాంటివి మరోసారి పునరావృతం అయితే జర్నలిస్టులు తగురీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఇప్పటికైనా విజయ్ సాయి రెడ్డి మీడియా మిత్రులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహా టివి భూపతి,టీవీ5 శివ, ఏబీఎన్ శ్రీనాథ్, ఐ న్యూస్ కుమార్, వార్త ఆనంద్, ఉదయం లక్ష్మీనారాయణ, ప్రజాశక్తి కిరణ్ కుమార్, బి ఆర్ కే న్యూస్ హరి, రాజ్ న్యూస్ ప్రశాంత్, ఆర్టీఐ ఎక్స్ప్రెస్ కలీం, ఎన్ 3న్యూస్ తరుణ్, బిగ్ టీవీ మురళీ, తేజ న్యూస్ తేజ్ కిరణ్, స్వతంత్ర టీవీ దుర్గ ప్రసాద్, ఈ నాడు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా ఇటుక బట్టీల వ్యాపారం..

**ఏమీ పట్టని అధికారులు!**
**చెరువులను గుళ్లచేస్తున్న ఇటుకబట్టి మాఫియా!**
**ఉచిత విద్యుత్‌ను దుర్వినియోగం చేస్తున్న మాఫియా!**
**ఇటుక బట్టీలను తయారుచేసి తమిళనాడుకు తరలించి వేలల్లో విక్రయింపు!**
**జీడీ నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్ ఇటుక బట్టీల మాఫియా!**
**మాఫియా మీద చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్!**

పాలసముద్రం మండలం సూర్య వాస్తవం :

మండలవ్యాప్తంగా 13 పంచాయతీలలో10 నుండి15 ఇటుక బట్టీలను ఏర్పాటు చేసి దందా కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు ఏ ఒక్క దానికీ అధికారిక అనుమతులు మాత్రం లేవు. బట్టీలు వెదజల్లే కాలుష్యం, బూడిద దుమ్మూ ధూళితో బట్టీల సమీపంలో ఉన్న పంట దిగుబడులపై ప్రభావం పడుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటుక బట్టీలను ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ, మైనింగ్ అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసే బట్టీలకు పంచాయతీ తీర్మానం కూడా తప్పని సరిగా ఉండాలి. కాలుష్య నియంత్రణ అధికారి అనుమతులు కూడా తీసుకోవాలి. ఇవేమీ

**పాలసముద్రం మండలంలో మూడింతల లాభాలు గడిస్తున్న ఇటుక బట్టీల వ్యాపారులు. ఎలాంటి పన్నులూ చెల్లించకుండా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. మండలంలో గత వైకాపా ప్రభుత్వంలో స్థానిక నాయకులతో కుమ్మక్కైఇటుక బట్టి వ్యాపారులు ఐదు సంవత్సరాల పాటు ఇటుక బట్టీలు తయారుచేసి అధిక మొత్తంలో తమిళనాడుకు తరలించి మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగించారు. ఇటుక బట్టీల ఏర్పాటుపై ఎలాంటి నియంత్రణా లేకపోవడంతో ఇటుక బట్టీలు పుట్టగొడుగుల్లా రోజు రోజుకి మండలంలో పుట్టుకొస్తున్నాయి. ప్రధానంగా మారుమూల గ్రామాల్లో ఇటుక బట్టీలను ఏర్పాటు చేస్తున్నా అధికారులకు పట్టడం లేదు.**

పట్టించుకోకుండానే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు గడించవచ్చనే ఉద్దేశంతో పోటీ పడి మరికొందరు వ్యాపారులు ఇటుక బట్టీలను ఏర్పాటు చేస్తున్నారు. అటవీ



ప్రాంతం, చెరువులు, కాల్వలకు సమీపంలో బట్టీలను ఏర్పాటు చేస్తూ విలువైన వనరులను కొల్లగొట్టేస్తున్నారు. ఇటుకల తయారీకి అనువైన మట్టిని ఇష్టారాజ్యంగా తవ్వేస్తూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీని ఎగవేస్తూ రూ.లక్షల ఆదాయాన్ని వెనకేసుకుంటున్నారు. అధికారుల కనుసన్నల్లోనే రాష్ట్ర ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకునేందుకు నిరంతరంగా వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తోంది. కానీ కొందరు ఇటుక బట్టీల వ్యాపారులు అధికారుల కనుసన్నల్లోనే యథేచ్ఛగా ఉచిత విద్యుత్‌ను దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇటుక బట్టీల వ్యాపారం చేసే యజమానులు విద్యుత్ శాఖ నుంచి ప్రత్యేక అనుమతులు పొందిన తర్వాతనే విద్యుత్‌ను వాడుకోవాల్సి ఉంటుంది. అలాకాక స్థానికంగా విధులు నిర్వహించే విద్యుత్ శాఖ సిబ్బందికి మామూళ్లతో ఎర వేస్తూ ఉచిత విద్యుత్ దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

దీంతో విద్యుత్ శాఖ కూడా రూ.లక్షల్లో ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తోంది. క్షేత్ర స్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమ విద్యుత్ వాడకానికి అడ్డూ అదుపూ లేకుండా పోతోందన్న విమర్శలున్నాయి. కొంతమంది రైతులు ఇటుక బట్టీల యజమానులకు సాగు భూములను లీజుకు ఇవ్వడంతో వ్యవసాయ మోటార్ల నుంచే ఇటుక బట్టీలకు విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. వలస కూలీలతో నిబంధనలకు విరుద్ధంగా వెట్టిచాకిరీ చేయిస్తున్నా కార్మిక శాఖ అధికారులు కన్నెత్తి చూడడం లేదు. మండలంలో దాదాపుగా 10 నుండి 15 వరకు ఇటుక బట్టీలు ఉన్నట్లు తెలుస్తోంది. వీరంతా మైనింగ్ శాఖ అనుమతులు తీసుకుంటే రూ.లక్షల్లో ఆదాయం ప్రభుత్వానికి వచ్చే అవకాశం ఉంది, కానీ ఏ ఒక్కరు కూడా నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా నడుపుతున్నారు. రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు ధ్రువీకరించిన వారికే అనుమతులు ఇస్తామని, ఇటుక బట్టీల నిర్వహణకు అనుమతులు తీసుకోవాలని చెప్పినా అవన్నీ మాటల్లోనే మిగిలిపోతున్నాయి. ఇకనైనా గంగాధర్ నెల్లూరు నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం.థామస్ మరియు స్థానిక తెలుగు దేశం పార్టీ నాయకులు ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## జనసేన క్రియాశీలక సభ్యత్వ మహా యజ్ఞాన్ని జయప్రదం చేయండి

### స్వేరో జిల్లా జనసేన నాయకుడు ఎం మహేష్

ఐరాల, జూలై 17(సూర్యవాస్తవం న్యూస్):

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం ఐరాల మండలంలో బుధవారం పత్రిక విలేకరులతో చిత్తూరు జిల్లా జనసేన నాయకులు మహేష్ స్వేరో మాట్లాడుతూ,గత పది సంవత్సరాలుగా ఎలాంటి లాభాపేక్ష లేకుండా,ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని,ఎన్నో లక్షల మంది ప్రజలకు అండగా నిలుస్తూ,నిరంతరం ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న జనసేన పార్టీ దేశంలో ఎన్నడూ లేని విధంగా కనీవిని ఎరుగని రీతిలో పోటీ చేసిన అన్ని స్థానాల్లో గెలుపొంది 100% స్ట్రైక్ రేటుతో భారతదేశ రాజకీయ చరిత్రలో అరుదైన ఘట్టం సృష్టించిన జనసేన పార్టీ అధినేత ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జనసేన పార్టీ ఎన్నో సేవలను అందిస్తూ,ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న విషయం ప్రతి ఒక్కరికి తెలిసిందే. ప్రస్తుతం జనసేన పార్టీ నాలుగవ క్రియాశీలక సభ్యత్వ మహా



యజ్ఞాన్ని జూలై 18వ తేదీ నుండి జూలై 28వ వరకు నిర్వహిస్తోంది. ఈ సభ్యత్వ మహా యజ్ఞ కార్యక్రమంలో ప్రతి ఒక్క జనసైనికులు,ఔత్సాహిక జనసైనికులు,యువతీ యువకులు,శ్రేయోభిలాషులు,జనసేన పార్టీ పవన్ కళ్యాణ్ అభిమానులు,శ్రేయోభిలాషులుసమాజ కాంక్ష ఉన్న ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదు చేసుకోవాలని కోరుతున్నాము. ఈ సభ్యత్వ నమోదుకు మీ యొక్క ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్, పాస్పోర్ట్ సైజ్ ఫోటో,నామిని పేరు,నామిని యొక్క ఆధార్ కార్డు,నామిని మొబైల్ నెంబరు,పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో పాటు 500 రూపాయల రుసుము చెల్లించవలెను. సభ్యత్వం పొందిన వారికి 5 లక్షల భీమా, 50 వేల రూపాయల ప్రమాద భీమా జనసేన పార్టీ తరఫున అందించబడును. మునుపెన్నడు ఎరుగని రీతిలో గత పది సంవత్సరాలుగా జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తన నిస్వార్ధమైన రాజకీయ ప్రయాణాన్ని కొనసాగించారు. ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా,వివిధ శాఖల మంత్రిగా మరింత రెట్టింపు స్థాయిలో ప్రజలకు మంచి చేయడానికి,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి క్షణం తీరిక లేకుండా కృషి చేస్తున్న జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కి జనసేన పార్టీకి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరుతున్నాము. ఈ జనసేన పార్టీ క్రియాశాలక సభ్యత్వ మహా యజ్ఞాన్ని జయప్రదం చేయాలని ప్రతి ఒక్కరిని కోరుతున్నట్లు చిత్తూరు జిల్లా జనసేన పార్టీ నాయకులు మహేష్ స్వేరో తెలిపారు.

## బైక్ చోరీకి పాల్పడిన నిందితుని అరెస్టు

ఐరాల, జూలై 17(సూర్యవాస్తవం న్యూస్):

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం ఐరాల మండల పరిధిలో బైక్ చోరీకి పాల్పడిన నిందితుని అరెస్ట్ చేసి 8,12,000 లక్షల విలువచేసే 12 బైక్లను స్వాధీనం చేసుకున్నట్లు వెస్ట్ సీఐ రవి శంకర్ రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం ఐదు గంటలకు కాణిపాకం పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్దిపట్లపల్లి వద్ద ఎస్సై రామ్మోహన్ అతని సిబ్బంది వాహనాలు



తనిఖీ చేస్తుండగా బంగారుపాళ్యం మండలం బండ్లదొడ్డి గ్రామానికి చెందిన తుమ్మల ఈశ్వర్ (అలియాస్) కోటేశ్వరరావు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించాడు. అతని అదుపులోకి తీసుకుని విచారించగా చెడు వ్యసనాలకు లోనై చిత్తూరు పెనుమూరు యాదమరి కాణిపాకం తిరుచానూరు తదితర ప్రాంతాలలో బైక్ దొంగతనానికి పాల్పడుతున్నట్లు తెలిపాడు. అతనిపై కేసు నమోదు చేసామని, రిమాండ్ కు తరలిస్తామన్నారు. బైకులు ఎవరు బయట పార్కింగ్ చేయవద్దని , చేసిన తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కేసులు చేదించిన ఎస్ఐ రామ్మోహన్ పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు అభినందించారు.

## మనోగత భావాలకు అక్షరరూపమే 'మానసవీణ'

### పూర్వ శాసనమండలి సభ్యుడు చదిపిరాళ్ళ నారాయణ రెడ్డి

మైదుకూరు(సూర్యవాస్తవం):

జి.యల్.లావణ్య భావుకత కలిగిన రచయిత్రి అని, ఆమె మనోగత భావాలకు అక్షరరూపమే 'మానసవీణ' కవితా సంపుటి అని పూర్వ శాసనమండలి సభ్యులు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ (జమ్మలమడుగు) చదిపిరాళ్ళ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. జి.యల్.లావణ్య రచించిన 'మానసవీణ' (కవితా సంపుటి) పుస్తకావిష్కరణ సభను బుధవారం సాయంత్రం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో కుటుంబ సభ్యులు, ఆత్మీయులు కలసి నిర్వహించారు. కార్యక్రమ ప్రారంభంలో ముఖ్యఅతిథి, వేదికపై ఉన్న ఇతర అతిథులతో కలసి పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం పుస్తక ఆవిష్కర్త మరియు ముఖ్య అతిథి చదిపిరాళ్ళ నారాయణ రెడ్డి మాట్లాడుతూ జి.యల్.లావణ్య వృత్తిరీత్యా న్యాయవాది అయినప్పటికీ కవితా రచనకు శ్రీకారం చుట్టి మంచి కవితలను రచించడం అభినందనీయమన్నారు. ఆమె తన కవితల్లో సంప్రదాయాలకు, గౌరవ మర్యాదలకు ప్రాధాన్యమిస్తూ అనేక అంశాలు అక్షరబద్ధం చేశారన్నారు. మనిషి బ్రతుకు విలువ తెలుసుకోవాలని, బాధ్యతగా మెలగాలని, సాటివారిని గౌరవించాలని, అప్పుడే మంచి సమాజం రూపుదాల్చుతుందని భావించారన్నారు. సభాధ్యక్షులు, ప్రముఖ వైద్యులు డా॥ పుత్తా బాలిరెడ్డి మాట్లాడుతూ కవయిత్రి లావణ్య తన జీవితంలో ఏర్పడిన ఆయా పరిస్థితుల్లో ఏ ఏ భావోద్వేగాలకు లేన్కొందో అప్పటికప్పుడు వాటన్నింటినీ అక్షరీకరించి, నేడు కవితా



సంపుటికి వెలువరించడం ముదావహన్నారు. ఆమె రచనాశ్కెలి కఠినపదాలు లేకుండా సరళంగా, ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. ఆత్మీయ అతిథి, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాద రెడ్డి మాట్లాడుతూ రచయిత్రి లావణ్య స్త్రీల అంతరంగాన్ని చక్కగా ఆవిష్కరించారని, మగవారు తప్పక చదవాలని, తద్వారా స్త్రీల అంతరంగం కొంత్కెనా వారికి అవగాహనకు వస్తుందన్నారు. ఆమె కవితల్లో భావకవిత్వపు పోకడలు ఉన్నాయని, ప్రకృతిని పలుచోట్ల కవిత్వీకరించిందన్నారు. మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సరిగోపుల లక్ష్మీనారాయణ (రాజంపేట) పుస్తక పరిచయం చేస్తూ మనసు పొరలపై తేలియాడే భావాలకు అద్దం పట్టిన కవితా సంపుటిగా 'మానసవీణ'ను అభివర్ణించారు. కరోనా నేపథ్యం నుండి రాసినా, స్నేహ సంబంధాల గురించి రాసినా, గణపతిని కీర్తించినా మనిషి బాగుండాలని కోరుకోవడమే రచయిత్రి లావణ్య కవితా తత్వంగా అర్థమవుతుందన్నారు. రచయిత్రి జి.యల్.లావణ్య తన స్పందనను తెలియజేస్తూ 'మానసవీణ' కవితా సంపుటిలోని పదాలు, వాక్యాలు తనలోని భావాలకు, ఆలోచనలకు, అప్పుడప్పుడు కలిగిన హృదయ స్పందనకు ప్రతిబింబాలన్నారు. ఈ కవితలు కేవలం తన అనుభూతులని, తన చుట్టూ చూసిన సమస్యలు, వాటిని గురించి తన మనసులో తలెత్తిన ఆలోచనలకు అక్షరాకృతి అని తెలిపారు. యోగివేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి సభా సమన్వయం చేయగా, వేంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు బి.గంగాధర్ వందన సమర్పణ చేశారు. వేదికపై ఉన్న అతిథులు రచయిత్రి జి.యల్.లావణ్యను సన్మానించారు. అనంతరం నిర్వాహకులు అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో రచయిత్రి భర్త సాయి వంశీకృష్ణ, సంజీవరెడ్డి, పుత్తా పుల్లారెడ్డి, డా॥ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డా॥ సులోచనాదేవి, డా॥ పాలెం వేణుగోపాల్, కె.కుమారస్వామి, కొత్తపల్లి రామాంజనేయులు, శ్యామసుందర్ రెడ్డి, భూపతి రాయల్ రచయిత్రి బంధువులు, మిత్రులు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

